మల్లన్నస్వామి ఊరేగింపు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. తొలుత అర్చకుడు దూపంమఠం వీరభద్రయ్య ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. రాత్రివేళ స్వామివారిని రథంపై ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



న్యూస్‌రీల్

ప్రజాసమస్యలపై ఆరా



దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే ఠాకూర్

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మంగళవారం ప్రజాసమస్యలపై ఆరా తీశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన విజ్ఞప్తులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. అనంతరం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బదావత్ శంకర్‌నాయక్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సర్కారు కాలేజీలో చదివిన విద్యార్థులు ఉన్నతస్థానంలో ఉన్నారన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నామని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు పాల్గొన్నారు.

వేములవాడ క్షేత్రానికి సింగరేణి రెస్క్యూ సిబ్బంది



స్పెషల్ క్యాంపులో రెస్క్యూ సభ్యులు

గోదావరిఖని: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వస్వామి సన్నిధిలో ఈనెల 26న జరిగే మహాశివరాత్రి వేడుకల్లో భక్తులకు సేవలు అందించేందుకు సింగరేణి రెస్క్యూ బృందం మంగళవారం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లింది. వేములవాడ రాజన్న ఆలయ ఈవో విజ్ఞప్తి మేరకు సంస్థ సీఎండీ బలరాం ఆదేశాల మేరకు 18 మందితో కూడిన రెస్క్యూ బృందం వేములవాడకు వెళ్లింది. మూడు రోజుల పాటు భక్తులకు సేవలు అందిస్తుంది.

గోదావరి తీరంలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనుల్లో కార్మికులు

రామగుండం: మహాశివరాత్రి సందర్భంగా అంతర్గాం సమీపంలోని గోదావరి రైల్వే వంతెన వద్ద గోదావరి నదిలో పంచాయతీ కార్మికులు మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గోలివాడ, అంతర్గాం పంచాయతీ కార్మికులు నదీ తీరంలోని చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. బుధవారం పుణ్యస్నానాల కోసం తరలివచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టారు.

న్యాయవాదుల నిరసన



చర్చలు జరుపుతున్న ప్రతినిధులు

గోదావరిఖనిటౌన్: స్థానిక వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి.. న్యాయవాది నామ్‌తాబాద్ కిరణ్‌తో దురుసుగా ప్రవర్తించారని పేర్కొంటూ గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారంనిరసన తెలిపారు. సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాటం సతీశ్, జనరల్ సెక్రటరీ జవ్వాజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరినీ దూషించలేదు

నామ్‌తాబాద్ కిరణ్‌జీపై తాను దురుసుగా ప్రవర్తించలేదని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ కార్యాలయానికి వచ్చిన సీఐ.. సభ్యులతో చర్చలు జరిపారు. తాను ఎవరినీ దూషించలేదని, అమర్యాదగా ప్రవర్తించలేదని స్పష్టం చేశారు.

ముగిసిన ప్రచారం

- ఎమ్మెల్సీ కోసం కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పోటాపోటీ సభలు
- పార్టీల క్యాడర్‌లో జోష్
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే



సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం పర్వం ముగిసింది. నిబంధనల మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి సైలెంట్ మోడ్ అమలులోకి వచ్చింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన పార్టీలు, సంఘాలు ధీమాగా ఉన్నాయి. కాంగ్రెస్ పక్షాన సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, బీజేపీ తరఫున కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఎస్పీ తరఫున బీసీ నేతలు నిర్వహించిన సభల సక్సెస్‌తో ఆయా క్యాడర్ జోష్‌లో ఉంది.

ఉమ్మడి కరీంనగర్ కీలకం

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కీలకంగా మారింది. ఉమ్మడి జిల్లా ఓటర్లు ఎటు మొగ్గితే వాళ్ల విజయం సాధించే అవకాశాలున్నాయి. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3 లక్షల 55 వేల 159 ఓట్లు ఉండగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 1 లక్షా 60 వేల 260 ఓట్లున్నాయి. అంటే ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి దాదాపు సగం ఓట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా ఓటర్ల తీర్పుపైనే అభ్యర్థుల భవిత ఆధారపడి ఉంది. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి మొత్తం 27,088 ఓట్లు ఉండగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 8,135 ఓట్లున్నాయి. ఇక్కడ కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లా గెలుపోటములను నిర్ణయించనుంది.

గెలుపుపై ధీమా

పట్టభద్రులకు సంబంధించి మొత్తం 56 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థుల నడుమ త్రిముఖ పోటీ నెలకొంది. అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి పార్టీల బలంపై, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ బీసీ వాదంపై ఆశలు పెట్టుకున్నారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 15 మంది పోటీలో ఉండగా, బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్, యూటీఎఫ్, యూఎస్‌పీసీ మద్దతుతో వై.అశోక్‌కుమార్, ఎస్టీయూ, సీపీఎస్‌ల నుంచి పోటీలో ఉన్న కూర రఘోత్తంరెడ్డి నడుమ పోటీ నెలకొంది.

ప్రచార సభలతో జోష్

గతంలో లేనివిధంగా ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం హోరెత్తింది. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార సభలు నిర్వహించి తమకు ఓటెందుకు వేయాలో వివరించే ప్రయత్నం చేశారు. సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రచార బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్య గెలుపు బాధ్యతలను పూర్తిగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భుజానికెత్తుకొన్నారు. కామారెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్ ప్రచారపర్వంలో పాల్గొన్నారు. బీసీ వాదంతో బరిలోకి దిగిన బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా బీసీ జేఏసీ రాష్ట్ర నేతలు, బీసీ సంఘాల నేతలు, ఓయూ జేఏసీ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న ప్రచారం నిర్వహించారు. ఆయా సభల విజయవంతంతో క్యాడర్‌లో జోష్ నెలకొనడంతో పాటు, గెలుపుపై ధీమా పెరిగింది.








ఎములాడ దారిలో..

- వైభవంగా రాజన్న జాతర షురూ
- తరలివస్తున్న భక్తులు
- నేడు మహాశివరాత్రి వేడుకలు
- రూ.2.39 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు
- గుడి చెరువులో శివార్చన కార్యక్రమాలు ప్రారంభం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం, విప్ ఆది, టీటీడీ అర్చకులు



వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎములాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే భక్తులు తరలివస్తున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు రాజన్నను దర్శించుకుని, కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాగరణ కోసం అంతా సిద్ధం చేసుకుంటున్నారు. కాగా, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్జిత సేవలన్నింటినీ రద్దు చేసి కేవలం లఘు దర్శనాలకు మాత్రమే అనుమతించారు. రూ.2.39 కోట్లతో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. గుడి చెరువులో రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శివార్చన కార్యక్రమంలో భాగంగా 1,500 మంది కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో జాగరణ చేసే భక్తులకు గుడి చెరువు వేదిక కానుంది. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి పెయిడ్ పాస్‌లను అధికారులు జారీ చేశారు. జాతరకు ఈసారి 4 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పక్షాన స్వామివారికి మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు సైతం స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- 500 మంది పోలీసు బలగాల సేవలు వినియోగం
- పోలింగ్ కేంద్రాల వద్ద ఆంక్షలు

పోలింగ్ లొకేషన్లు	36
పోలింగ్ కేంద్రాలు	108
పోలీసులు	560

పోలీసు బలగాల వివరాలు

ఏసీపీలు	5
సీఐలు	21
ఎస్సైలు	37
ఏఎస్సైలు	111
హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు	198
హెజీఎస్	78



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 27న టీచర్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్నారు. పోలింగ్ ప్రశాంతంగా సాగేందుకు 36 లొకేషన్లలో 108 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పెద్దపల్లి జోన్‌లోని 15 లొకేషన్లలో 50 పోలింగ్ కేంద్రాలు, మంచిర్యాల జోన్‌లోని 21 లొకేషన్లలో 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.


వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ పూర్తి

కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, జియో ట్యాగింగ్ ప్రక్రియ పూర్తిచేశారు. రూట్ మొబైల్స్ 19, స్ట్రైకింగ్ ఫోర్స్ 17, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ 05, ఎఫ్ఎస్టీ/వీఎస్టీ టీమ్‌లు ఏడు ఏర్పాటు చేశారు.

పోలీసు ఆంక్షలు..

పోలీస్ కమిషనరేట్ పరిధిలో పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో సాగేందుకు వీలుగా ఈనెల 25న సాయంత్రం 4గంటల నుంచి ఈనెల 28న ఉదయం 8గంటల వరకు పోలీసుల ఆంక్షలు అమలులో ఉంటాయి. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల చుట్టూ 163 బీఎన్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుంది. ఐదుగురు, అంతకన్నా ఎక్కువమంది గుమికూడరాదు. పార్టీ జెండాలు, గుర్తులు, ప్లే కార్డులు ధరించ రాదు. మైకులు, లౌడ్ స్పీకర్ల వినియోగానికి అనుమతి లేదు. పాటలు, ఉపన్యాసాలు ఇవ్వకూడదు. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడాన్ని నేరంగా పరిగణించనున్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు



ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. 560 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని ఇందు కోసం నియమించాం. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, వెబ్‌కాస్టింగ్‌తోపాటు జియోట్యాగింగ్ పూర్తిచేశాం. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, పోలీస్‌కమిషనర్, రామగుండం

వాటర్ బెల్ కొట్టాల్సిందే..



మంచినీళ్లు తాగుతున్న ఈ విద్యార్థులు గోదావరిఖని ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందినవారు. ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఉపాధ్యాయులు మూడు పూటలా వాటర్‌బెల్ ప్రోగ్రాం అమలు చేస్తున్నారు. చిన్నారులకు సరిపడా నీళ్లు అందుబాటులో ఉంచుతున్నారు.

- రోజూ మూడుసార్లు విద్యార్థులు నీరుతాగేలా ప్రత్యేక చర్యలు
- అధిక ఎండ, వడదెబ్బ, డీహైడ్రేషన్ నుంచి రక్షణకు..
- వాటర్‌బెల్ కార్యక్రమం అమలు చేయాలంటున్న తల్లిదండ్రులు

సాక్షి, పెద్దపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్వెల్, మధ్యాహ్న భోజనం, బడి ముగింపుతోపాటు మరో మూడుసార్లు మోగేది వాటర్ బెల్. ఉదయం 10.35 గంటలు, మధ్యాహ్నం 12.00, ఆ తర్వాత మధ్యాహ్నం 2.00 గంటలకు దీనిని మోగిస్తారు. ఆ వెంటనే ప్రతీ విద్యార్థి మంచినీరు తాగాల్సిందే. దీని ద్వారా చిన్నారుల్లో నీరు తాగే అలవాటు పెరుగుతుందని విద్యా శాఖ భావిస్తోంది.

కేరళ స్ఫూర్తిగా..

రెండేళ్ల క్రితం కేరళ పాఠశాలల్లో తొలిసారి 'వాటర్ బెల్' కార్యక్రమం అమలు చేశారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ సహా అనేక రాష్ట్రాల్లో విద్యాబోధనకు విరామం ఇచ్చి విద్యార్థులు నీళ్లు తాగేలా ప్రణాళిక రచించారు. అన్ని పాఠశాలల్లో దీనిని అమలు చేశారు. తొలుత బాగానే అన్ని పాఠశాలల్లో ఈ ప్రక్రియ అమలు కాగా, ప్రస్తుతం ఎక్కడ కూడా వాటర్ బెల్ మోగడంలేదు. ప్రభుత్వ పాఠశాలల్లోనే కాకుండా ప్రైవేట్ స్కూళ్లలోనూ ఇది అమలుకు నోచుకోవడం లేదు. తాగునీటి సౌకర్యం లేక, ఆర్వో ప్లాంట్లు, మిషన్ భగీరథ కనెక్షన్లు ఉన్నా నీరు రాక వాటర్‌బెల్ అమలు కావడం లేదు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా, ఇతరత్రా అనారోగ్య సమస్యల బారినపడకుండా వాటర్ బెల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటి నుంచే వాటర్..

జిల్లాలో 545 ప్రభుత్వ పాఠశాలలుండగా అందులో 24,221 మంది, 176 ప్రైవేట్ పాఠశాలలుండగా అందులో 57,501 మంది విద్యార్థులు చదువుతున్నారు. తాగునీటి సౌకర్యం లేక దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇళ్ల నుంచే వాటర్ బాటిళ్లలో నీళ్లు తెచ్చుకుంటున్నారు. దాహం వేసినా.. మధ్యాహ్నం భోజనం తినేదాకా ఆ నీటిని తాగడం లేదు. కొన్ని సందర్భాల్లో ఆటాపాటల్లో పడి నీరు తాగడంలేదు. దీంతో ఎదిగే పిల్లల్లో యూరిన్ ఇన్‌ఫెక్షన్ సమస్యలు తలెత్తుతున్నాయి. పీడియాట్రిక్ యూరోలిథియాసిస్ సమస్యతో బాధపడుతున్న బడిపిల్లల సంఖ్య కొన్నేళ్లుగా పెరుగుతోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో క్రమం తప్పకుండా నీళ్లు తాగడమే పరిష్కారమని వారు అంటున్నారు.



నిరుపయోగంగా కనిపిస్తున్న ఈ కుళాయిలు ఓదెల మండలం గోపరపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోనివి. ఇందులో 55 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారు తాగేందుకు నీటిసౌకర్యం లేదు. విద్యార్థులు ఇళ్ల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు. ఎండ తీవ్రతతో మధ్యాహ్నం వరకే ఆ బాటిల్ నీళ్లు ఖాళీ అవుతున్నాయి. స్కూల్‌లో వాటర్ ట్యాంక్ లేదా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఎదిగే పిల్లల ఆరోగ్యం కోసం..

బడిపిల్లలు రోజూ కనీసం లీటరున్నర నుంచి మూడు లీటర్ల వరకు మంచినీళ్లు తాగాలి. జెండర్, వయసు, బరువును బట్టి ఇది కాస్త అటూఇటూ మారుతూ ఉంటుంది. శరీరంలో నీటిశాతం తగ్గినప్పుడు డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఇదొక్కటే కాకుండా పలు అనారోగ్య సమస్యలూ తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. మూత్రం లేత గోధుమ రంగులో ఉంటే ఆరోగ్యంగా ఉన్నారని, లేత పసుపు రంగులో ఉంటే సాధారణ స్థితి, ఆరోగ్యంగా ఉన్నట్లు అని, ముదురు పసుపు రంగులోకి మారితే శరీరానికి నీరు అవసరమని అర్థమంటున్నారు. తేనెరంగులో ఉంటే శరీరానికి తగినంత నీరు అందడం లేదని పేర్కొంటున్నారు. ముదురు గోధుమ రంగులో మూత్రం వస్తే వెంటనే ఎక్కువ నీరు తాగాలని అర్థం. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలల వద్ద పోస్టర్లు అంటించి చిన్నారులకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా ఎదిగే పిల్లల్లో నీటిలోపం లేకుండా వాటర్ బెల్ విధానం ఎంతో ఉపయోగపడుతుంది. ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో దీనిని ప్రతీ పాఠశాలలో విధిగా మోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇదేవిషయమై డీఈవో మాధవిని సంప్రదించగా.. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మంచినీళ్లు అందుబాటులో ఉంచుతామన్నారు.

20 లోగా పనులు పూర్తిచేయండి



టీబీ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- టీబీ అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు చేయాలి
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన రోడ్లు, డ్రెయినేజీలు తదితర అభివృద్ధి పనులను మార్చి 20వ తేదీలోగా పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీతో కలిసి కలెక్టర్ మంగళవారం ఆయన పర్యటించారు. లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్ ప్రాంతాల్లో రూ.29 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులతోపాటు రూ.5కోట్లతో సింగరేణి జీఎం కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్ డిపో వరకు చేపట్టిన డ్రెయినేజీల అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగాలి..

గోదావరిఖని అడ్డగుంటపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. గర్భిణుల ప్రసవ సమయాలపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రసవాల సంఖ్య పెరిగేలా కార్యాచరణ అమలు చేయాలని కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వే పూర్తి చేసి 'అభా' కార్డులను జనరేట్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి మణికేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణ శిబిరం తనిఖీ

బల్దియా కార్యాలయంలోని టీబీ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ చేశారు. 'పరీక్షలు సరే.. జాగ్రత్తలేవీ?' శీర్షికన ఈనెల 19న 'సాక్షి' కథనం ప్రచురించింది. స్పందించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష.. నేరుగా బల్దియాలోని టీబీ నిర్ధారణ పరీక్ష కేంద్రానికి చేరుకు న్నారు. పరీక్షల కోసం వచ్చిన వారితో మాట్లాడి సేవల తీరుపై ఆరా తీశారు. జనం గుంపులుగా ఉండకుండా చూడాలని, అనుమానితులందరికీ పరీక్షలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి

పెద్దపల్లిరూరల్: మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మహిళా సాధికారత ప్రచార పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈనెల 24 నుంచి 28 తేదీ వరకు మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తోందన్నారు. కుటుంబం అభివృద్ధి మహిళల చేతిలోనే ఉంటుందని ఆయన అన్నారు. ఆర్థిక ప్రగతికి పొదుపు చాలా కీలకమని, ప్రతీఒక్కరు పొదుపు అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు.

క్లుప్తంగా

ప్రేమిస్తున్నానని బాలికను వేధించిన వ్యక్తికి జైలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ప్రేమిస్తున్నాని ఓ బాలికను వేధిస్తున్న మియ్యాపూర్ గ్రామానికి చెందిన గోషిక కుమార్(23)కు ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి, సెషన్స్ జడ్జి శ్రీనివాస్‌రావు మంగళవారం 30 రోజుల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2019 నవంబర్ 20న ఓ బాలికలను ప్రేమిస్తున్నా, తననూ ప్రేమించాలని, ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని వేధించాడు. తనను ప్రేమించకుంటే చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితురాలి తండ్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు కోర్టులో సాక్ష్యాధారాలు సమర్పించారు. వాదనలు విన్నంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

మంథనిలో బోర్డు తిప్పేసిన నగల వ్యాపారి?

మంథని: పట్టణంలోని ఓ నగల దుకాణదారు బోర్డు తిప్పేసి పరారైనట్లు చర్చ జోరుగా సాగుతోంది. దుకాణానికి తాళం వేసి కుటుంబం మొత్తం నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిందని సమాచారం. వారి మొబైల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకున్నట్లు తెలిసింది. దుకాణం తెరవకపోవడం, ఫోన్లు పనిచేయకపోవడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. తమకు కుచ్చుటోపీ పెట్టి ఉడాయించారా? లేదా ఏదేవి అవసరం నిమిత్తం వెళ్లారా? అనేది తెలియాల్సి ఉంది. వివాహాలకు సంబంధించి ఆభరణాల కోసం చాలా మంది దుకాణాదారుకు బంగారం ఇచ్చినట్లు తెలిసింది. అదేవిధంగా స్థానికుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బు అప్పుగా తీసుకున్నట్లు సమాచారం. దుకాణాదారు పరారు కావడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం


చంద్రయ్య (ఫైల్)

కోరుట్లరూరల్: మాదాపూర్‌కు చెందిన ముక్కెరాల చంద్రయ్య (70) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. చంద్రయ్య సైకిల్‌పై వెంకటాపూర్ వెళ్లి తిరిగి మాదాపూర్ వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అంజూ ట్రాక్టర్ నడుపుతూ వెంకటాపూర్ వైపు వెళ్తున్నాడు. కాకతీయ కాలువ డీ-40 మూలమలుపు వద్ద చంద్రయ్య ట్రాక్టర్‌ను ఢీకొట్టి రోడ్డు కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రయ్య కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బంధువులు డ్రైవర్ అంజి ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. స్థానిక నాయకులు సముదాయించి ధర్నాను విరమింప చేశారు.

తండ్రి హత్య కేసులో యావజ్జీవం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): పూసాల గ్రామానికి చెందిన తీగల రాజేశం(40) తన తండ్రి తీగల నర్సయ్యను హత్య చేశాడనే నేరం రుజువు కావడంతో యావజ్జీవ శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి శ్రీనివాస్‌రావు మంగళవారం తీర్పు ఇచ్చారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన నర్సయ్య కుటుంబం పూసాలలో నివాసం ఉంటోంది. రాజేశం 20ఏళ్ల క్రితం హత్యాయత్నం కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. అప్పట్నుంచి తల్లిదండ్రులతోనే కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో 2023 డిసెంబర్ 8న ఉదయం కొనుగోలు సెంటర్లో ధాన్యం అరబెట్టేందుకు పెద్దకొడుకు రాజేశం, చిన్నకోడలును రావాలని తండ్రి నర్సయ్య పిలిచారు. రాజేశం సైకిల్‌పై అక్కడకు వెళ్లగా.. తాను పనిచేయనని సైకిల్‌పై వెళ్లిపోతున్నాడు. ఈ క్రమంలో తండ్రి సైకిల్ తాళం చెవి తీసకున్నాడు. ఆగ్రహించిన రాజేశం బలంగా నెట్టి వేయడంతో తండ్రికింద పడిపోయాడు. ఆ వెంటనే బండరాయితో తలపై మోదాడు. దీంతో నర్సయ్య మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేసిన పోలీసులు.. కోర్టులో సాక్ష్యాధారాలు సమర్పించారు.

వేటగాళ్లపై అడవిపందుల దాడి

చందుర్తి: అడవిపందుల దాడిలో వేటగాళ్లకు తీవ్రగాయాలయిన ఘటన చందుర్తి శివారులోని బోడగుట్ట ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. జోగాపూర్ గ్రామానికి చెందిన సంచార జీవనం సాగించేవారితో అడవిపందుల వేటకు వెళ్లారు. అప్పటికే వారికి పంది చిక్కగా, మరో దానికోసం వేటాడుతుండగా దాడిచేసింది. ఓ వ్యక్తికి తీవ్రగాయాలు కాగా, మరో వ్యక్తికి స్వల్పంగా గాయపడినట్లు సమాచారం.

ముగిసిన అంతర్రాష్ట్ర క్రీడలు

- క్రీడల విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ రాజేంద్రనగర్, ఉత్తర తెలంగాణ జట్టు
- విజేతలకు బహుమతులు ప్రదానం


మాట్లాడుతున్న ఝాన్సీరాణి


బహుమతి అందుకుంటున్న రాజేంద్రనగర్ జట్టు

జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానంలో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్రాష్ట్ర క్రీడా, సాంస్కృతిక పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలకు వ్యవసాయ వర్సిటీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె. ఝాన్సీరాణి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతీ నారాయణ్ భట్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి వర్సిటీ క్రీడలకు పొలాస కళాశాల వేదిక కావడం అభినందనీయమన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ పోటీల్లో పాల్గొడడం వల్ల క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. వ్యవసాయ వర్సిటీ క్రీడా పరిశీలకులు డాక్టర్ సురేశ్, వర్సిటీ నాన్ టీచింగ్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, జయరామ్, కళాశాల స్టూడెంట్ ఆఫైర్ కన్వీనర్ డాక్టర్ మహేశ్ రెడ్డి, క్రీడా ఇన్‌చార్జి డాక్టర్ రత్నాకర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, నాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ షిప్ రాజేంద్రనగర్ జట్టు

రాష్ట్రస్థాయి క్రీడల విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ రాజేంద్రనగర్ జట్టు కైవసం చేసుకోగా, సాంస్కృతిక విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను ఉత్తర తెలంగాణ జట్టు కైవసం చేసుకుంది. క్రికెట్‌లో దక్షిణ తెలంగాణ, వాలీబాల్‌లో మధ్య తెలంగాణ, బాల్ బ్యాడ్మింటన్‌లో ఉత్తర తెలంగాణ, షటిల్ బ్యాడ్మింటన్‌లో రాజేంద్రనగర్, టేబుల్ టెన్నీస్‌లో రాజేంద్రనగర్, చెస్‌లో మధ్య తెలంగాణ, కార్యమ్‌లో మధ్య తెలంగాణ జట్టు విజయం సాధించాయి. వివిధ జోన్లకు చెందిన క్రీడాకారులు బహుమతులు అందుకున్నారు.

మూడు రోజులు ఉత్సాహంగా



మూడు రోజులు క్రీడాపోటీల్లో ఉత్సాహంగా సాగాయి. వివిధ క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది.
– అయేషా, అడ్మినిస్ట్రేటివ్ జోన్, హైదరాబాద్

స్నేహభావం పెంపు



క్రీడాపోటీల్లో పాల్గొనడంతో కొత్తవారితో స్నేహభావం పెంపొందుతుంది. మూడు రోజులు నిర్వహించిన క్రీడా పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాం.
– సుకన్య, రాజేంద్రనగర్ జోన్

టీం సహకారంతో..



ఒక్కరిగా కాకుండా టీం సహకారంతో చాలా పతకాలు గెలుచుకున్నాం. క్రీడా, సాంస్కృతిక పోటీలు ఉత్తేజం నింపాయి. క్రీడా పోటీల నిర్వహణ బాగుంది.
– అనురాధ, ఉత్తర తెలంగాణ జోన్







శివరాత్రి సందడి



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉపవాస దీక్షలు చేసి భక్తుల కోసం వ్యాపారులు పూజాసామగ్రి, పూలుపత్రి సిద్ధం చేశారు. పరమశివుని అనుగ్రహం కోసం భక్తులు పరితపిస్తారు. తమను, తమ కుటుంబాలను చల్లంగా చూడాలని పూజిస్తారు. ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలతో సిరులు కురవాలని కోరుకుంటారు. ఇందుకోసం శివునికి ప్రీతికరమైన గోగుపూవు, దోసకాయ, మొక్కజొన్న కంకులు, శనిగకాయ, కందగడ్డ.. ఇలా పలురకాల నైవేద్యాలు సమర్పిస్తారు. దీపాలు వెలిగించి పూజలు చేస్తారు. పెద్దపల్లి జెండా కూడలిలో శివరాత్రి కొనుగోళ్ల సందడి 'సాక్షి' కెమెరాకు ఇలా కనిపించింది.

సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

యూనియన్ కోసం శ్రమించిన వారికే భవిష్యత్

- ఐఎన్‌టీయూసీ నేత జనక్‌ప్రసాద్


యూనియన్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: యూనియన్ బలోపేతం కోసం కష్టపడే వారికి భవిష్యత్ ఉంటుందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. స్థానిక జనక్‌భవన్‌లో ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాలిగామ మల్లేశ్, టీబీజీకేఎస్ మాజీ ఫిట్ సెక్రటరీ నాగేశ్వర్‌రావు తదితరులు ఐఎన్‌టీయూలో చేరారు. వారికి జనక్‌ప్రసాద్ కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ముందుకు సాగాలన్నారు. కాగా, మల్లేశ్‌ను కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు. ఐఎన్‌టీయూసీలో చేరినవారిలో నాయకులు గుర్రం రవి, వేల్పుల తిరుపతిరెడ్డి, బండ తిరుపతిరెడ్డి, జగదీశ్‌నాయక్, పరశురాం, కుమారస్వామి, సుదర్శన్‌రెడ్డి, కుంట శ్రీనివాస్, రాసకట్ల సదానందం, రాజ్‌కుమార్, పోచంపల్లి మధు, పారిపల్లి వెంకటి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్రం, ధర్మపురి, దశరథం తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే విజయరమణారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రులకు అండగా ఉంటుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మదర్ థెరిసా ఇంజినీరింగ్ కాలేజీలో ఉమ్మడి మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్– కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి గెలుపు కోసం సమావేశం ఏర్పాటు చేశారు. న్యాయవాదులు, ప్రైవేట్ టీచర్లు, పట్టభద్రులు హాజరయ్యారు. పట్టభద్రులు అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని సూచించారు. కార్యక్రమంలో అడ్వకేట్లు, టీచర్లు, పట్టభద్రులతోపాటు ప్రతినిధులు గోపగాని సారయ్యగౌడ్, ఎండీ మస్రత్, తాజు, శ్రీనివాస్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో లక్ష్యం సాధించాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి


మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: పార్టీ భవిష్యత్ లక్ష్య సాధనకు బీఆర్‌ఎస్ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ కోరారు. స్థానిక మార్కండేయకాలనీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో చందర్ మాట్లాడారు. అబద్ధాల హామీలతో గద్దెనేక్కిన కాంగ్రెస్ పార్టీ.. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. నాయకులు మూల విజయారెడ్డి, నడిపెల్లి అభిషేక్‌రావు, అముల నారాయణ, పెంట రాజేశ్, పాముకుంట్ల భాస్కర్, కుమ్మరి శ్రీనివాస్, గాధం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, బాదె అంజలి, ముదాం శ్రీనివాస్, గోపు అయిలయ్య యాదవ్, నడిపెల్లి మురళీధర్‌రావు, అచ్చ వేణు, నూతి తిరుపతి, రాకం వేణు, జేవీరాజు, బొడ్డు రవీందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలు చేయాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఆస్తిపన్ను వసూలులో నిర్లక్ష్యం వహించకుండా 100శాతం నమోదు చేయాలని అడిషనల్ కలెక్టర్, సుల్తానాబాద్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ అరుణశ్రీ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆస్తిపన్ను బకాయిలను వెంటనే వసూలు చేయాలన్నారు. వీటిద్వారా మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు ముందుకు సాగుతాయని అన్నారు. ప్రజలు సహకరించి, పన్నులు సకాలంలో చెల్లించాలని సూచించారు. టాప్‌టెన్‌లోని బకాయిలను వసూలు చేసేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ మహ్మద్ యాజ్‌తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తండ్రి ఆస్తి కాజేసేందుకు తనయుడి కుట్ర

- పథకం ప్రకారం దొంగతనం
- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- 70 తులాల బంగారం, రూ.1.5 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్‌జి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జి

హుజూరాబాద్: పట్టణంలో సంచలనం రేపిన చోరీ కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. మంగళవారం హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన రాఘువరెడ్డికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నాగరాజు, అతడి భార్య శాలిని రాఘువరెడ్డి వద్ద ఉన్న బంగారు నగలు, నగదు కాజేసేందుకే కుట్ర పన్నారు. హోటల్లో పనిచేసే అమీర్ సాయంతో పథకం అమలు చేయాలనుకున్నారు. అమీర్‌కు బంధువైన వరంగల్ జిల్లా మల్కాపూర్‌కు చెందిన సమీర్, అతడి స్నేహితులు మున్నా, కృష్ణతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో నాగరాజు నిర్వహించే హోటల్‌లో సమీర్, మున్నా, కృష్ణ కలుసుకుని చోరీ గురించి చర్చించారు. అనంతరం మద్యం తాగి రాత్రి 10 గంటల సమయంలో నాగరాజు ఉండే ఇంటిపైకి నలుగురు చేరుకున్నారు. తనపై ఎలాంటి అనుమానం రాకుండా నాగరాజు ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఇంట్లో పడుకున్నాడు. అంతా నిద్రిస్తున్న సమయంలో మరికొంత మద్యం కావాలని చెప్పడంతో అమీర్ తీసుకువచ్చేందుకు బయటకు వెళ్తున్న క్రమంలో ముందుగా అనుకున్న ప్రకారం రాఘువరెడ్డి ఇంటి ముందున్న కరెంట్ మోటార్‌ను ఆన్‌చేసి వెళ్లాడు. మోటార్ ఆఫ్ చేయడానికి రాఘవరెడ్డి ఇంట్లో నుంచి ఎవరైనా బయటకు వస్తే దాడికి పాల్పడవచ్చని పన్నాగం పన్నారు. వారు ఊహించినట్లే మోటార్ ఆఫ్ చేయడానికి రాఘవరెడ్డి భార్య బయటకు వచ్చింది. అక్కడే మాటు వేసి ఉన్న ముగ్గురు ఆమెపై దాడి చేసి ఇంట్లోకి చొరబడ్డారు. రాఘవరెడ్డితో పాటు భార్య వినోద, వారి కూతురు మానసపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. 70 తులాల బంగారం, రూ.1.50 లక్షల నగదుతో పారిపోయారు. కేసు దర్యాప్తులో భాగంగా ఏసీపీ శ్రీనివాస్ జి, టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. అనంతరం మూడు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. రాఘవరెడ్డి తనయుడు నాగరాజు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని నిర్ధారణకు వచ్చి అతడిని అదుపులో తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. ఈసందర్భంగా కేసును త్వరగా ఛేదించిన ఏసీపీ శ్రీనివాస్ జి, టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్ఐ మహమ్మద్ యూనస్ అలీ, సీసీఎస్ టీం సిబ్బంది సురేందర్ పాల్, సాయి అవినాష్, టెక్ టీం సిబ్బంది ప్రదీప్, సంతోష్, సిబ్బందిని సీపీ అభిషేక్ మహంతి అభినందించారు.

ఉదయ సాహితీ రాష్ట్ర కార్యవర్గం


సేనాధిపతి


లక్ష్మయ్య


సునంద

జ్యోతినగర్(రామగుండం): ఉదయ సాహితీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు శ్రీదాస్యం లక్ష్మయ్య ప్రకటించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడిగా దాస్యం సేనాధిపతి(కరీంనగర్), అధ్యక్షుడిగా శ్రీదాస్యం లక్ష్మయ్య(పెద్దపల్లి), ఉపాధ్యక్షులుగా ఎన్వీ రఘువీర్ ప్రతాప్(నల్గొండ), పోరెడ్డి రంగయ్య(ఆలేరు), పల్లేరు వీరాస్వామి(వరంగల్), ఎర్రం రాజారెడ్డి(కరీంనగర్), శ్రీపెరంబుదూరి లింబగిరి స్వామి(మెట్‌పల్లి), మహిళా ఉపాధ్యక్షులుగా చీదేళ్ల సీతాలక్ష్మీ(హైదరాబాద్), రమాదేవి కులకర్ణి(హైదరాబాద్), మద్దెల సరోజన(జగిత్యాల), చిందం సునీత(కరీంనగర్), కటుకం కవిత(కోరుట్ల), ప్రధాన కార్యదర్శిగా వురిమళ్ల సునంద(ఖమ్మం), సహాయ కార్యదర్శులుగా ఏడెల్లి రాములు(పెద్దపల్లి), గుడ్ల దొన సాయిచంద్రశేఖర్(హైదరాబాద్), మేరుగు అనురాధ(వరంగల్), నగునూరి రాజన్న(కరీంనగర్), కోశాధికారిగా తులసి వెంకటరమణాచార్యులు(హైదరాబాద్)ను నియమించారు.

కాలువ పనులు ప్రారంభించకుంటే దీక్ష

- రంగనాయక సాగర్ ప్రాజెక్టు ఎల్‌ఎం- 6 కెనాల్ రైతుల హెచ్చరిక


రైతులతో మాట్లాడుతున్న డీఈ సీతారాం

ఇల్లంతకుంట: రంగనాయకసాగర్ ప్రాజెక్ట్ అనుబంధ ఎల్ఎం -6(లెఫ్ట్ మైనర్) అసంపూర్తి కాలువ పనులు ప్రారంభించకుంటే మార్చి 3వ తేదీన నిరాహార దీక్ష చేస్తామని ప్రభావిత రైతులు హెచ్చరించారు. ఈమేరకు రంగనాయక సాగర్ ప్రాజెక్టు డీఈ సీతారాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. రంగనాయక సాగర్ ప్రాజెక్టు డీఈ సీతారాం.. దాచారం శివారు నుంచి చిన్న లింగాపురం శివారు మధ్య ఒక కిలోమీటర్ మేర నిలిచిపోయిన ఎల్ఎం – 6 కాలువ పనుల స్థల పరిశీలన కోసం మంగళవారం వచ్చారు. సమాచారం అందుకున్న పెద్ద లింగాపురం, రామాజీపేట, చెక్కుడువానిపల్లి గ్రామాల రైతులు డీఈ వద్దకు వెళ్లారు. కాలువ పనులు ఎందుకు సాగడం లేదని నిలదీశారు. నీళ్ల అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు. దీంతో ఆర్ఐ షఫీయుద్దీన్‌ను వెంటనే కాలువల వద్దకు రావాలని డీఈ ఆదేశించడంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అసంపూర్తి పనులు, భూముల గురించి వివరణ అడిగారు. అయితే, అవి తమ పరిధిలో లేదని ఆర్ఐ వివరించారు. అసంపూర్తి పనులతో ఏడుగురు రైతులకు రూ.1.30 కోట్ల చెల్లింపులు ఆగిపోయాయని పెద్ద లింగాపురం రైతులు అంటున్నారు. కార్యక్రమంలో రైతులు అమ్ముల అశోక్, ఎలవేణి రమేశ్, కరికే నవీన్, కమటం రవి, జి.మల్లేశం, వీఆర్వో సింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన యువకుడు


పాస్‌పోర్టుతో శ్రీకాంత్

జగిత్యాలక్రైం: మోసపూరిత విదేశీ నియామక సంస్థ చేతుల్లో మోసపోయిన కొడిమ్యాల మండలం చెప్యాలకు చెందిన వలస కార్మికుడు కడకుంట్ల శ్రీకాంత్ పలువురి సహాయంతో మంగళవారం స్వగ్రామం చేరాడు. శ్రీకాంత్‌ను 40 రోజల క్రితం జగిత్యాలకు చెందిన మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ఎలక్ట్రీషియన్ ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చి దుబాయ్ పంపించింది. అక్కడికి చేరిన అనంతరం లేబర్ ఉద్యోగంలో చేర్పించారు. ఆ పని చేయబోనని శ్రీకాంత్ అనడంతో పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని 7300 దిరమ్స్ (ఇండియా రూ.2లక్షలు) చెల్లించాలని కంపెనీ యాజమాన్యంతోపాటు, కేరళకు చెందిన ఓ ఏజెంట్ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు టీపీసీసీ ఎన్ఆర్ఐసెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషాను ఆశ్రయించారు. ఆయన దుబాయ్‌లోని ఇండియన్ ఎంబసీకి సమాచారం అందించారు. స్పందించిన ఎంబసీ వారు కంపెనీ యాజమాన్యాన్ని మందలించడంతో శ్రీకాంత్‌ను స్వగ్రామానికి పంపించేందుకు నిరాకరించారు. దీంతో ఇండియన్ ఎంబసీ దుబాయ్ ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. లేబర్ కోర్టు విచారణ జరపగా శ్రీకాంత్ కోర్టులో నెగ్గాడు. దీంతో కంపెనీ యాజమాన్యం ఫిర్యాదును కొట్టివేసి అతని పాస్‌పోర్టును శ్రీకాంత్‌కు అప్పగించడంతో మంగళవారం స్వగ్రామానికి చేరుకున్నాడు.

అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్య


రాకేష్ (ఫైల్)

కోనరావుపేట: కళాశాల నుంచి వస్తూ అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో రైలు కిందపడి మృతి చెందినట్లు తల్లిదండ్రులకు సమాచారం అందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పొట్ల బాలమల్లు– మంజుల దంపతుల కుమారుడు రాకేశ్ (18)హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటికి వస్తూ సిరిసిల్ల బస్టాండ్‌లోని ధర్మారం గ్రామానికి వెళ్తున్న ఆటోలో బ్యాగు పెట్టాడు. తర్వాత కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రాకేశ్ హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో సూసైడ్ నోట్ రాసి రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందింది. అమ్మ, నాన్న క్షమించండి. నాకు బతకాలని లేదు. నా చావుకు కారణం ఎవరు కాదు అని సూసైడ్ నోట్‌లో అంది. పోలీసులు ఫోన్‌లో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. రాకేశ్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.